# నా మాట నమ్మరూ?

◆ శ్రీమతి మద్దాళి ఉషా గాయత్రి ◆

**"బడే సాబ్ వున్నాడా?" అన్న ప్రశ్న విని తలవంచుకు వైపు చేస్తున్న నేను తలెత్తాను.**

ఎదురుగా నిలబడిన వ్యక్తి కేసి పరీక్షగా చూశాను.

చాలా రఫ్‌గా వుందతని ధోరణి. అతని మాట తీరు, మనిషితీరు చాలా నిర్లక్ష్యంగా వుంది. తైల సంస్కారం లేని జుట్టు అదుపు లేకుండా మొహం మీద పడుతోంది. తరచు జరదాకిళ్ళీ నమలటం మూలాన కాబోలు పళ్ళు నల్లగా వున్నాయి.

క్రితం రాత్రి నిషా యింకా తగ్గినట్టుగా లేదు, కళ్ళు ఎర్రగా వున్నాయి.

"బడే సాబ్ వచ్చాడా? లేదా? అసలు! చెప్పరేం ది. అప్పట్నించి చెప్పవేంటి?"

ఈసారి అతని కంఠం స్థాయి తీవ్రమవడంతో, అతన్నే నిశితంగా పరికిస్తున్న నేను ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను.

హాలంతా కలయచూశాను. టైము సాయం కాలం 5 దాటటంతో స్టాఫ్ చాలామటుకు వెళ్ళిపోయారు. క్రింది హాల్లో తాను మాత్రం వుండి పోయింది. టైపు చేయవల్సిన మేటరు చాలా వుండడంతో.

"లేదు! ఈరోజు అసలు ఆఫీసుకే రాలేదు!" కోపం వచ్చినా, తమాయించుకొని మామూలుగా చెప్పడానికి ప్రయత్నించాను.

"హు ఎన్నిరోజులు అతను తప్పించుకుంటాడో మీరు తప్పిస్తరో గది గూడా నేను చూడకపోను! నా సంగతి తెల్వదు నా కొడుకుకు ప్రాణానికి ప్రాణం యిస్తా మంచి గుంటే మస్తోనా లేకుంటే ప్రాణం తీస్తా నా కొడుకుది" విసురుగా నేల తాటించుకుంటూ పోయాడతను.

"హమ్మయ్య!" అనుకొని పర్సు, టిఫిన్ బాక్సు తీసుకొని బయటపడ్డాను.

★ ★ ★ ★

ఇంటికి వెళ్ళానన్న మాటేగాని, నా మనసులో ఈ "బడేసాబ్" అనబడే వ్యక్తిని గూర్చే ఆలోచన. నేనాఫీసులో చేరి సంవత్సరం దాటుతోంది. చేరిన కొత్తలో ఈ "బడాసాబ్" ఉనికి ఓ పజిల్ గా తోచేది ఆ ఆఫీసులో అతను ప్రవేశం, పరిచయం, అయిన రోజు నాకింకా బాగా గుర్తుంది.

ఆరోజు

సాయంకాలం నాలుగుగంటల ప్రాంతంలో

నేను పని పూర్తిచేసుకొని, టేబిల్ సర్దు తుండగా,

ఆఫీసు గేటు దగ్గర ఆటో ఆగిన చప్పుడు వినిపించింది.

ఆ వెంటనే హాల్లో ఓ చైతన్యం.

"హల్లో బడాసాబ్! అరే మూర్తి మన రాజు దొరగారు వస్తున్నారు" అంటు శర్మ అరవడం వినిపించి. కుతుహూలంగా అటుకేసి, ఆ వచ్చిన వ్యక్తి ఎవరా? అని చూసింది. మనసులో మాత్రం "ఎవరీ బడాసాబ్?" తను వచ్చిన రోజునించి ఆ పేరు వింటోంది కానీ చూడలేదు. అతను ఎప్పుడొస్తాడో ఎప్పుడు పోతాడో తెలీదు. అసలు పేరు ఏమిటోగానిఅతన్ని అందరూ బడాసాబ్! మైనర్ రాజా, అని వ్యవహరిస్తుంటారు. తను కొంచెం రిజర్వుడ్‌గా వుంటుంది. అందులో ఎవరితోనూ ఎక్కువ పరిచయం లేని కారణాన వివరం ఎవరినీ అడగలేదు.

అందరూ అతనికిచాలా ఘనంగా స్వాగతం చెప్పడం కుశలప్రశ్నలడగడం. అందరి భుజాలని చరుస్తూ, మీద చేతులేసుకు తిరగడం గమనించి 'అతనూ ఓ క్లర్కు కాబోలు' అనుకుంది.

అంతలో లోపల్నించి ఆఫీసరు బయటకువచ్చి,

**కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

**కథ**

# మనసులో ఎక్కడో మంచితనం మేల్కొని పలకరించింది.



"అరే తమరా? ఏమిటి విశేషం? ఇంతకీ తమరు ఇవ్వాళ ఆఫీసుకు వచ్చినట్టా! రానట్టా" అని అడుగుతూ అతని భుజం మీద చేయి వేస్తూ అడిగాడు.

ఇద్దరూ బిగ్గరగా ఏదో నవ్వుకుంటూ ఆఫీసరు గదిలోకి వెళ్ళడం, చూస్తుండగానే అటెండన్స్ రిజిస్టర్‌లో అతను సంతకం పెట్టడం. ఆ సంతకం పెట్టడం కోసం వాడిన పెన్ను కూడా ఆఫీసరు జేబులోనిదే కావటం గమనించి ఒక్కింత ఆశ్చర్య పోయింది.

"ఏమిటితని ధైర్యం? ఇతను యింతకీ క్లర్కా, ఆఫీసరా లేక... ఇంకేమై వుంటాడో వూహించలేక పోయింది.

మెల్లగా ప్యూన్ శివయ్యని పిలిచి వాకబు చేసింది.

అతను చెప్పింది విని మతిపోయింది.

"ఈ బడాసాబ్ అనబడే సదరు శాల్తీ ఓ ప్యూనా?"

తన ఆశ్చర్యానికి అంతులేకపోయింది.

అది చూచి శివయ్య నవ్వుకొన్నాడు.

"అమ్మా! అతను ఓ రోజు రాకపోతే ఈ ఆఫీసులో ఎక్కడ ఏముందో ఎవ్వరికీ తెలీదు. అన్ని విషయాలకీ అతనిమీదే ఆధారపడతారు. అది గ్రహించే అతను అంత ధీమాగా, దర్జాగా తిరుగుతాడు" ఏమీ అర్థం కాలేదు. తెల్లమొహం వేసుక్కూర్చున్న నన్ను చూసి శివయ్య మళ్ళీతనే.

"అతని పలుకుబడి అదీ గమనించండి. అయినా మీరు ఆఫీసుకు కొత్త ఇలాంటివన్నీ నిదానం మీద తెలుస్తాయి" తేలిగ్గా నవ్వేస్తూ అన్నాడు.

ఆ మార్నటినుంచి "బడాసాబ్"ని గమనించడం ఓ దినచర్యగా మారింది.

వేస్తున్నది ప్యూను ఉద్యోగం అయినా, వెలగబెట్టేది ఆఫీసరు దర్జా. మడత నలగని బట్టలు, చెక్కు చెదరని క్రాఫ్, కళ్ళకి రిఫ్ఁడిగ్లాసెస్, నోట్లో కిళ్ళీ తప్పితే సిగరెట్ అవి రెండు కూడా ఎవరి కైంకర్యమొ తప్ప తనుగా కొనడమే? వూ హు!

ఆఫీసుకి కూడా ఆటోలోనే వచ్చేవాడు.

స్టాఫ్‌నంతా ఏదో మహా సొంతవాళ్ళని పిలిచినట్టు, గుర్తు లేక పేరు పెట్టో, ఏకవచనంతో సంబోధించేవాడు.

ఆ అలవాటయిన ధోరణిలోనే ఓ రోజు,

"ఇదిగో నీకు ఫోను వచ్చింది పోయి తీసుకో" అనడంలో చెప్పలేనంత కోపం ముంచుకొచ్చింది.

"చూడు వీరాస్వామి! మాట్లాడ్డాం మర్యాదగా వుండాలి ఎలా పడితే అలా, ఎవర్నంటే వాళ్ళని ఇష్టం

వచ్చినట్టు పిలవకు'' అని విసురుగా అనేసి అక్కడ్నించి వెళ్ళిపోయినా హాలంతా ఒక్కసారిగా నిశ్శబ్దమయిపోయింది.

వెనక్కి తిరిగి చూడకపోయినా 'బడాసాబ్' మొహం ఎలా అవమానంతో మాడిపోయి వుంటుందో వూహించుకోగలను అతనికి, తన సర్వీసులో ఇలాంటి సన్నివేశం ఎదురవలేదు కాబోలు నోట మాట రాక కళ్ళప్పగించి చూస్తుండిపోయాడు.

కొందరి ముఖాల్లో ఆశ్చర్యం, మరికొందరి మొహంలో మెచ్చుకోలు స్పష్టంగా కన్పించాయి నాకు.

ఫోను మాట్లాడి వచ్చాను. ''బడాసాబ్'' మళ్ళీ అంతులేడు. అసలు ఎవరితోనూ, ఎక్కువగా మాట్లాడని, పరిచయం పెంచుకోని తను అంత గట్టిగా మాట్లాడ్డం అన్నది ఆఫీసులో మిగతా వారి వూహ కందనిది. 'బడాసాబ్'కి ఓ రకమైన షాకే అవుతే. మిగతా వారికి అది సర్ప్రైజ్.

లంచ్ టైములో అందరూ ఓ టేబిల్ దగ్గర కూర్చుంటారు. తన టేబిల్ దగ్గరే లంచ్ తీసుకునేది.

మిగతావాళ్ళు అరగంటసేపు లంచ్ చేస్తూ హస్కు కొట్టేవాళ్ళు.

అది అయిం తర్వాత ''కాఫీ తాగుదాం పద బాస్'' అంటూ బయటకి వెళ్ళిపోయేవారు. ఇది ఓ రివాజుగా సాధారణంగా ప్రతి ఆఫీసులో జరిగే ప్రహసనం.

ఓ రోజు లంచ్ టైములో వారి మాటల్లో 'బడా సాబ్' ప్రసక్తి రావడం గమనించి ఒకలాంటి ఉత్సుకతతో ఓ చెవి అటు పారేసింది.

''చూడవోయ్ శర్మా! మన మైనర్ రాజా లేడూ ఈసారి నా దగ్గర ఓ యాభై మాత్రం తీసుకొని బతికించాడు''.

ఆ గొంతు రామ్మూర్తిది.

''భలే వాడివోయ్ నువ్వుగాదు అదృష్టవంతుడివి నేను'' అన్నాడు.

''అదేం''.

''నీ దగ్గర యాభై తీసుకొని నా అప్పు తీర్చాడు''.

''ఆ'' అంటూ ఆశ్చర్యపోయారందరూ.

''అస్సలు బడాసాబ్ రాజకీయాల్లో వుంటే మంత్రి అయిపోయుండేవాడు కనీసం'' శ్రీనివాస్ అన్న మాటలకి అందరూ ఒక్కసారిగా పెద్దపెట్టున నవ్వారు.

''మరి నీ సంగతేమిటి శ్రీనివాసు''.

అతనుపదిలంగా పర్సులోంచి కొన్ని చెక్కులు తీసాడు..

అది చూచి శర్మ, రామ్మూర్తి తదితరులు ''అన్నీ చెక్కులే'' అన్నారు.

''అవునోయ్ అన్నీ చెక్కులే. ఎందుకు పనికివస్తాయి? కనీసం నాలుక గీసుకోటానికి కూడా పనికిరావు'' దొరగారి అకౌంట్‌లో బాలన్స్ వుంటే కదా''

నాకు కొద్దికొద్దిగా అర్థంఅవుతోంది. ఈ బడా సాబ్ అందరి దగ్గర అప్పులు తీసుకొని, సరదాగా గడిపేస్తున్నాడని, కేవలం అతని అప్పుల రామాయణం ఆఫీసుకే పరిమితం కాకుండా చుట్టుప్రక్కల వారి దగ్గర తీసుకోవడం వరకు ప్రాకిందని గ్రహించాను. తన శాయ శక్తులా అప్పులు చేసి, తీర్చే ప్రయత్నం ఏమీ చేయడంలేదనిపించింది. అప్పులు తీర్చే ప్రయత్నంలో అబద్ధాల నాశ్రయించి బతుకుతున్నాడని గ్రహించాను.

జీవితంలో అతను సాధించిదేమైనా వుందా? అని చూస్తే, 'బుట్టెడు అప్పులు, పుట్టెడు అబద్ధాలు' అనిఅనవచ్చు.

కొత్తల్లో ఓ రోజు

''నాకోవంద కావాలి. వచ్చేనెల జీతం వచ్చాక తీసుకోవచ్చు'' అన్నాడు ఎటో చూస్తూ.

నాకు అతను అప్పు అడుగుతున్న తీరుకు, దర్జాకి, నవ్వాలో, ఏడవాలో తెలీలేదు. 'అడగటంలో కూడా అయ్యగారికి అంత ఫోజు కావాల్సివచ్చిందా!' అని మనసులో అనుకొని.

''చూడు వీరాస్వామి! నాకు ఒకరిని అప్పు అడగటం కాని, ఇంకోరి దగ్గర అప్పు తీసుకోవటం కాని, రెండూ నచ్చవు. అవసరానికని అబద్ధం చెప్పి, అప్పు చేసి జల్సా చేస్తూ తిరిగేవారంటే నాకు పరమ అసహ్యం. నీలాంటివాళ్ళనే ''పారాసైట్స్'' అంటారు అంటే సర్వకాల సర్వావస్థలయందు వారి జీవనం కోసం ఇతరులపైనే ఆధారపడే వాళ్ళన్నమాట. నీవు చెప్పేవి ఏవీ నిజాలు కావని అందరికీ తెలుసు.

●●●


**క్రితం రాత్రి నిషా ఇంకా తగ్గినట్టుగా లేదు**

●●●



## ఎదురు చూపుల్లో 'అనురాధ'

కేసెట్ కింగ్ 'గుల్షన్ కుమార్' తన ఆస్థాన గాయని అనురాధా పోడ్వాల్'ని కొన్ని గంటల పాటు ఎదురుచూపుల్లో గడిపేలా చేశాడు. ఆమె పాడిన క్రొత్త ఆల్బమ్ 'దీవాంగి' కేసెట్ విడుదల సందర్భంలో నిర్ణయించిన సమయం 8.30కే ఆమె వచ్చి గుల్షన్ కోసం ఎదురుచూస్తూ వుంది. కానీ ఆయనగారు 10.00 గంటలు దాటినా వస్తున్న జాడలేక పోవటం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.



## మరో హీరో కొడుకు

ఒక నాటి హీరోలందరూ — తమ కొడుకుల్ని సినిమాల్లోకి దింపుతున్నట్లుగానే ఇప్పుడు 'వినోద్ ఖన్నా' తన కొడుకు 'రాహుల్'ని రంగంలోకి దింపాలను కొంటున్నాడు. అందుకు తగిన అర్హతకోసం రాహుల్‌ని విదేశాలకు పంపి నటనలో డాన్సులో, ఫైట్స్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాడు.

ఈ అబద్ధపు జీవితం నీ భవిష్యత్తుపైన ఎంత దెబ్బతీస్తుందో నీకు అనుభవంలో తప్ప అర్థంకాదు. ఆరోజున 'నేను చెప్పేది నిజం నన్ను నమ్మండి బాబు' అని నువ్వు ఎంత మొరపెట్టుకున్నా ఒక్కరూ నమ్మరు వీరాస్వామి. అప్పుడు నువ్వు నష్టపోయేది ఎవరూ తీర్చలేనిది పూడ్చలేనిది నువ్వు వేసే అప్పులాంటిదీ అవుతుంది తప్ప'' నెమ్మదిగా మంద్రస్థాయిలో అతనికి మాత్రమే వినిపించేటట్లు చెప్పాను. అతను కాస్సేపు మౌనంగా నిలబడ్డాడు. అతనికేసి పరీక్షగా చూశాను. 'నా మాటలు ఎంతవరకు విన్నాడు అని అనుమానం వచ్చింది. అయినా నా పిచ్చిగాని పద్ధతుల్లో పరాకాష్ట వేరుకున్న అతని మీద నా మాటలే మాత్రం ప్రభావం చూపగలవు. చెవిటి వాడి ముందు శంఖం వూదినట్లు. ఇతనికి నీతిసూత్రాలు వల్లించేంత బుద్ధితక్కువ పని ఇంకోటి లేదు.

లోకంలో డబ్బుకి తప్ప ఇంక దేనికి విలువ లేదు. అందులో వీరాస్వామికి లోకంలో అప్పు తప్ప మరేమీ ముఖ్యంకాదు. అలాంటివాడు ఓ మనిషికి ఆ మనిషి చెప్పే మాటకు విలువ ఇవ్వడం అన్నది జరగని పని.

మౌనంగా నిట్టూర్చి నా పనిలో పడ్డాను.

ఇది జరిగిన కొద్దిరోజులకు మళ్ళీ అతను ఒకరికి తెలీకుండా ఒకరి దగ్గర అప్పుకు ప్రయత్నిస్తున్నాడని గమనించాను. అతను లేని సమయం చూసి అందరూ మళ్ళీ మీటింగ్ పెట్టారు.

''రామ్మూర్తీ! ఏమైనా సరే నేను ఇంక మీదట బడాసాబ్ కి ససేమిరా అప్పు ఇవ్వదల్చుకోలేదు. పాత బాకీలు రాకపోతే పోయాయిగాని కొత్తది మాత్రం వూహు నా వల్లకాదు'' నాకు నవ్వొచ్చింది. 'ఎవరైనా అప్పు తీర్చడం నావల్లకాదు అంటారు. బడాసాబ్ దెబ్బకి ఇతను అప్పు ఇవ్వడం వల్లకాదు అంటున్నాడు.

''అవును బాస్! వాళ్ళురోజుల్నించీ వెనకబడ్డాడు. ఈసారి కారణం మార్చాడు. వాళ్ళ పిల్లకేదో జబ్బు అన్నాడు''.

''ఏమిటి జబ్బు''

'ఏం జబ్బో''.

''కాన్సర్ బతకదు అన్నాడు''

''భేష బావుందోయ్ ఇన్ని రోజులు చిన్న చిన్న అవసరాలు ఖర్చులు, రోగాలు అని చెప్పేవాడు. వందలతో బతికించేవాడు. ఇంక ఈసారి ఏం ప్లానో ఏకంగా కాన్సర్ పేరు చెప్పాడు. ఈ రోగం పేరుతో ఇంక అప్పు వేల మీద పుట్టించొచ్చు అనుకున్నాడు కాబోలు. అతని మాటలని నమ్మే అమాయకులింక ఎవరూ లేరిక్కడ'' అన్నాడు శర్మ కసిగా.

అందరిలోనూ యిలాంటి ఆలోచన రావడం ఒక ఆరోగ్యకరమైన మార్పుకు సూచనగా తోచింది కొన్ని కొన్ని సమయాల్లో తీసుకునే కొన్ని నిర్ణయాల వల్ల మనకు తెలీకుండానే మరొకరికి మేలు చేస్తుంటాం.

అదే రోజు సాయంకాలం యింటికి వెళుతుండగా 'బడాసాబ్' ఎదురుపడ్డాడు. మొహంలో పూర్వపు దర్జా పొగరు లోపించాయి. పదిలంఖణాలు చేసినట్టుగా వుంది. చూడనట్టుగా పోబోయింది. రెండు అడుగులు వేశాక మనసులో ఎక్కడో మంచితనం మేల్కొని పలకరించింది.

''ఏమిటి వీరాస్వామి! ఆఫీసులో కొత్తగా కన్పించటం మానేశావు ఒంట్లో బాగోలేదా?'' అప్రయత్నంగానే నా కంఠంలో ఆప్యాయం, ఆర్ద్రత ధ్వనించింది.

ఆకాస్త పలకరింపుకే కదిలిపోయాడు అతని కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి.

''అమ్మా! ఈ మాత్రం ఆరాగా అడిగేవాళ్ళు కరువైయ్యారు. ఆరోజు మీరు నాకు చెప్పిన విషయాలు నాలో ఏదో తెలీని మార్పునుతెచ్చాయి. సున్నితంగా మీరుచెప్పిన హితవు సూటిగా నా మనసులో నాటుకుంది. నిజంగా అప్పు యిక మీదట చెయకూడదనే నిర్ణయానికి పురికొల్పింది. నా దర్జాలన్నీ మానుకొన్నాను. కాని నేను మారానన్న నిజాన్ని నమ్మేదెవరు? నిజంగా నా బిడ్డ చావుబతుకుల మధ్య కొట్టుకుంటోంది. వైద్యానికి అవసరంగా అప్పు అడిగితే అందరూ నన్ను హేళనగా చూసినవ్వారు. దబాయించి అడిగినప్పుడు కిమ్మనకుండా యిచ్చారు. ఇప్పుడు దయాభిక్షగా అడిగితే లేదంటున్నారు. ఈరోజునాకు కనువిప్పు కలిగింది. అబద్ధపు జీవితానికి, నిజంగా గుడ్ బై కొడుతున్నాను. నన్ను నమ్మండి మేడమ్. మీకు నా మాటలు అపనమ్మకంగా అన్పిస్తుంటే నాతోపాటు రండి. కాన్సర్ హాస్పిటల్ లో వున్న నా బిడ్డని చూద్దురుగాని. ఇది కేవలం నేను మారానని మీరు నమ్మడానికి చెప్తున్న మాటలే గాని, అప్పుకోసం మాత్రం కాదు. నన్ను నమ్మండి' అంటూ చేతుల్లో మొహం దాచుకొని భోరుమన్నాడు.

నా కళ్ళు అప్రయత్నంగా చెమ్మగిల్లాయి.

మనిషి నిజంగా మారినప్పుడు నమ్మడు ఈ లోకం అతనికి విలువ నివ్వదీ సమాజం.

అబద్ధపు ముసుగునించి, నిజాల వెలుగులోకి రావడం ఎంత కష్టమో, అర్థమవుతోంది.

నటనకి, నిజానికి, దర్జాకి, అవసరానికి సహస్రాంశం తేడా వుంది.

●



## మేలు చేసిన 'అలజడులు'

దామిని దర్శకుడు 'రాజ్ కుమార్ సంతోషి'కి ఆ మధ్య జరిగిన బాంబు ప్రేలుళ్ళు, అలజడులు లాభదాయకంగా మారాయట. ఆ చిత్రాన్ని నిర్మించటానికి అతనికి 18 నెలలు పట్టింది. కోటి రూపాయలు దాకా బడ్జెట్ అదనంగా పెరిగింది. ఆ తప్పు తనమీద పడకుండా, ఆ తరువాత జరిగిన బాంబుప్రేలుళ్ళు కారణంగా ఆ నష్టం జరిగిందని తప్పించుకొని డిస్ట్రిబ్యూటర్స్ ను తృప్తిపరచి, ఏప్రిల్ నెలాఖరులో ఆ చిత్రాన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాడు.



## కలిసొచ్చిన 'దుశ్మన్'

దుశ్మన్' అనే పదం అంటే రాజ్ కుమార్ కోహిలికి మహా ఇష్టం. ఆ శబ్దంతో అతను తీసిన మొదటి చిత్రం 'జానీదుశ్మన్' సూపర్ హిట్ అయ్యింది. ఆ తరువాత 'ఇంసానియత్ కె దుశ్మన్' చిత్రం తీశాడుఅది కూడా అతని జేబులు నింపింది. ఇప్పుడు ఆయన తన కొడుకు 'అర్మాన్ కోహిలి' కెరీర్ ని నిలబెట్టాలని 'బెలాద్ కె దుశ్మన్' నిర్మిస్తున్నాడు.